క్లుప్తంగా

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం 3వ శనివారం సందర్భంగా వేకువ జాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రతనాల వెంకటేశ్వరునికి ప్రత్యేక అలంకారం



ప్రత్యేక అలంకరణలో రతనాల వెంకటేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జామున స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా శనివార వ్రతం



భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన శ్రావణమాస 3 వ శనివార వ్రతం అత్యంత వైభవంగా జరిగింది. వ్రతంలో పట్టణ మహిళలు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు తులసి సురేష్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు కిశోర్‌శర్మ వ్రతాన్ని శాస్త్రయుక్తంగా మహిళలతో నిర్వహింప చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రావణ మాసంలో చేసే ఈ వ్రతం వల్ల మంచి ఫలితం ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

అనాథ పిల్లలకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో జాస్మిన్, సురేష్ బాబు, బన్నీ తదితరులు

ప్రొద్దుటూరు : బెంగళూరుకు చెందిన జాస్మిన్, సురేష్‌బాబు కుమారుడు బన్నీ జన్మదినం సందర్భంగా శనివారం మధ్యాహ్నం సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆవరణలోని అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌పీజీ–1 చర్చి కమిటీ మెంబర్ జ్యోతి గడ్డం సురేష్, గ్రేస్ చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ విజయ ఆల్బర్ట్, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం, రత్నరాజుతోపాటు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రభుత్వం విస్మరించడం తగదని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జీఓ నెంబరును 117 ఉపసంహరించుకోవాలని కోరారు.

16న రాస్తారోకో

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 16న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద రాస్తారోకో చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 నెలల నుంచి విద్యుత్ వినియోగదారులపై 25 శాతం నుంచి 80 శాతం వరకు అదనపు భారాలను మోపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఓబులేసు, షాకీర్ విజయ్ పాల్గొన్నారు.

• వృథాగా పోతున్న నీరు



బుచ్చనపల్లెలో వృథాగా పోతున్న తాగునీరు

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లె గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన డైరెక్టు పంపింగ్ స్కీం గేటువాల్ దెబ్బతినడంతో వచ్చే నీరంతా వృథాగా పోతోంది. నెలల తరబడి నీరు వృథాగా పోతున్నా గేటువాల్ బాగు చేయాలన్న ఆలోచన అధికారులకు రాకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు దెబ్బతిన్న గేటువాల్ స్థానంలో కొత్త గేటు వాల్‌ను ఏర్పాటు చేసి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

• పడకేసిన పారిశుధ్యం

బి.కోడూరు : మండలంలో పారిశుధ్యం పడకేయడంతో అంటువ్యాధులు ప్రబలడంతో పాటు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారిందని మండల వాసులు వాపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని మున్నెల్లి గ్రామ పంచాయతీలోని మున్నెల్లి గ్రామంలో మంచినీటి పథకానికి సంబంధించి నీరు వృథా పోతుండటంతో రహదారుల వెంట నీరు నిలిచి మురికినీరుగా మారింది. దీంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులకు, స్థానిక సర్పంచ్‌కు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి వృథా నీటిని అరికట్టి పారిశుధ్య చర్యలు చేపట్టాలని మండల ఉపాధ్యక్షుడు ఓ.మాధవరెడ్డి తెలిపారు.



రహదారి వెంట నిలిచి ఉన్న మురికినీరు

మండల స్థాయి పోటీల్లో విజేతల ఎంపిక

మైదుకూరు : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మైదుకూరులో శనివారం విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలను ఎంపిక చేశారు. ఉత్తమ చేతి రాత, 1947 తర్వాత భారత గెలుపు కథ, ఎన్నికలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఆదివారం బద్వేలులో డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది తెలిపారు.

ప్రభాకర్‌కు జీవిత సాఫల్య పురస్కారం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ఏపీ అసెంబ్లీ ఓఎస్‌డీ టు గవర్నమెంట్ చీఫ్ విప్ డాక్టర్ ఎం.ప్రభాకర్‌కు హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ సాహిత్య రంగంలో జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. విజయవాడ హోటల్ ఐలాపురంలో ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

స్పీడ్‌బ్రేకర్లు తొలగించండి



స్పీడ్‌బ్రేకర్లు తొలగించాలని ఆర్‌అండ్‌బి జేఈతో మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

గోపవరం : మండలంలోని పి.పి.కుంట నుండి బ్రాహ్మణపల్లె వరకు ఆర్‌అండ్‌బి రోడ్డుపై అడ్డదిడ్డంగా వేసిన స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని ప్రయాణికులతో పాటు వాహనదారులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. 15 కిలోమీటర్లు ఉన్న పి.పి.కుంట నుండి బ్రాహ్మణపల్లె వరకు 58 స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయంటే వాహనదారుల పరిస్థితి ఏవిధంగా ఉందో చెప్పకనే తెలిసిపోతుంది. బద్వేలు నుండి బ్రాహ్మణపల్లె వరకు ఒకే ఆర్టీసీ బస్సు తిరుగుతుంది. మధ్యలో ఒక ట్రిప్పు కడపకు వెళ్లి వస్తున్నందున ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందికరంగా ఉండటంతో బస్సును నిత్యం బ్రాహ్మణపల్లెకు తిప్పాలని ఇటీవల స్థానికులు ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే స్పీడ్‌బ్రేకర్లు అధికంగా ఉన్నందున డ్రైవర్లు కూడా ఈ రూట్‌కు వచ్చేందుకు సుముఖత చూపడం లేదని అధికారులు చెబుతున్నారు. రోడ్డు పక్కన పాఠశాలలు ఉన్న చోట స్పీడ్‌బ్రేకర్లు ఉంచి మిగిలిన స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని అప్పుడే బస్సును అన్ని ట్రిప్పులు తిప్పుతామని ఆర్టీసీ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇటీవల రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ ఇబ్బందికరంగా మారిన స్పీడ్‌బ్రేకర్ల విషయాన్ని ఆర్‌అండ్‌బి జేఈ రెడ్డిగోవింద దృష్టికి తీసుకెళ్లారు. అనుమతి లేకుండా ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద స్పీడ్‌బ్రేకర్లు వేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించాలంటే స్పీడ్‌బ్రేకర్లు తొలగించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు. వీలైనంత త్వరగా అనుమతి లేని స్పీడ్‌బ్రేకర్లను తొలగించి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని ఎస్‌ఐ అధికారులకు సూచించారు.

రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఎరువులు



చాపాడు రైతు భరోసా కేంద్రంలోని ఎరువులు

చాపాడు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకునే రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉంచుతున్నట్లు మండల వ్యవసాయాధికారి మ్యాగి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో యూరియా, పాస్ఫేట్ ఎరువులు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల రైతులు నారుమళ్లు సాగు చేసుకుంటుండగా, కుందూనది పరీవాహక ప్రాంతాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సమాయాత్తమవుతున్నారు. ఇప్పటికే అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రాజువారిపేట, సీతారామాపురం, చాపాడు, ఖాదర్‌పల్లె గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. ఇదే క్రమంలో మండలంలోని సీతారామాపురం, శ్రీరాములపేట, కుచ్చుపాప, అల్లాడుపల్లె, పెద్దగురువళూరు గ్రామాలలో ఇప్పటికే పసుపు సాగు చేశారు. ఈ పంటల సాగు కోసం రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయని, ఎరువులు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డులతో రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

ఉచితంగా కృత్రిమ కాలు, చేయి



కృత్రిమ కాలు కోసం కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేటలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు ఉచితంగా జైపూర్ కృత్రిమ కాలు, చేయి అమర్చేందుకు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్‌పర్సన్ కళావతి, కో చైర్మన్ రామచంద్రుడు మాట్లాడుతూ హుబ్లీకి చెందిన ఆల్ ఇండియా జైన్ యూత్ ఫెడరేషన్, మహవీర్ లింబ్ సెంటర్ సహకారంతో ఉచితంగా దివ్యాంగులకు కృత్రిమ కాలు, చేయి అమర్చుతున్నట్లు తెలిపారు. శ్రీసన్నుతి శ్రీనివాసులు అండ్ సన్స్, హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి వినాయక ఫార్మ, శ్రీసిద్ధి వినాయక ఫార్మ, ప్రొద్దుటూరుకు చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో 75 మంది దివ్యాంగులను పరీక్షించి కొలతలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు సన్నుతి శ్రీనివాసులు, అధ్యక్షుడు చిట్టెం రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు ప్రకాష్, కార్యదర్శి రమేష్, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బిక్కి పండ్లు.. భళా కలే పండ్లు..



బిక్కిపండ్లు



కలే పండ్లు

వైవీయూ: అటవీ ఉత్పత్తులకు ఎప్పుడూ ప్రజల్లో డిమాండ్ ఉంటూనే ఉంటుంది. పల్లె ప్రాంతాలు, అటవీ ప్రాంతాలకు పరిమితమైన బిక్కిపండ్లు (గార్డెనియా లాటిఫోలియా), కలే పండ్లు (కరిస్సా స్పైనేరియం) కడప నగర ప్రజలకు అందుబాటులో రావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

గ్లాసు రూ.40 నుంచి రూ. 50 చొప్పున కలే పండ్లు, బిక్కిపండ్లు అమ్ముతున్నారు. అద్భుతమైన రుచి, పోషకాహార విలువలు తెలిసిన ప్రజలు కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో మధ్యాహ్నం సమయానికే సరుకు పూర్తిగా అమ్ముడుపోవడంతో పాటు డబ్బులు బాగా వస్తుండటంతో అడవి నుంచి ఇక్కడికి తీసుకుని వచ్చి అమ్ముకుంటున్నవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా కలేపళ్లలో విటమిన్ సి, విటమిన్ ఏ, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, 10 శాతం మేరకు ప్రొటీన్, 22 శాతం ఫాటీ ఆయిల్, 12.6శాతం పాల్మిటిక్ తదితర గుణాలతో చక్కటి పోషక, ఔషధ విలువలు ఉన్నట్లు వైవీయూ బొటానికల్ గార్డెన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా బిక్కి పండ్లలో విటమిన్ సి లభించడంతో పాటు ఔషధ గుణాలు కలిగి ఉండటం, టైప్–2 మధుమేహవ్యాధి నియంత్రణలో సైతం ఈ పండ్లకు ప్రాధాన్యత ఉందన్నారు. అటవీ ప్రాంతంలో లభించే ఈపండ్లలో చక్కటి పోషకాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎన్‌ఎంయూఏ కొత్త కార్యవర్గం ఎన్నిక

మైదుకూరు : మైదుకూరు డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. పట్టణంలో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో అతిథులుగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, లీగల్ అడ్వైజర్ మూలే నాగిరెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ శివారెడ్డి, రీజనల్ సెక్రటరీ పి.సుధాకర్ పాల్గొని కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ మైదుకూరు డిపో నూతన ప్రెసిడెంట్‌గా బీఎస్ రెడ్డి, సెక్రటరీగా జీబీ సిద్ధయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు వీఎస్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు మెనూ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వసతిగృహాలను సందర్శించి వసతిగృహ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు లోకేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగురువళూరులో 125 మందికి వైద్య పరీక్షలు

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరులో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఓబులేసు తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి వైద్య పరీక్షలు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి వైద్య సిబ్బందితో కలసి ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక రోగులను పరీక్షించి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

19 నుంచి పాలకొండ్రాయునికి శ్రావణమాస పూజలు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని శ్రీ పాలకొండ్రాయస్వామి క్షేత్రంలో ఈనెల 19నుంచి శ్రావణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జేసు వెంకట సుబ్బారెడ్డి, పాలక మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ మాసంలో మొదటి శ్రావణ శనివారం సందర్భంగా 19న శ్రీ పాలకొండ్రాయస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, సర్వదర్శనం ఉంటాయన్నారు. రెండవ శనివారమైన ఈనెల 26న స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. మూడవ శనివారమైన సెప్టెంబరు 2న ఉదయం11 గంటలకు క్షేత్ర ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. నాల్గవ శనివారం సెప్టెంబరు 9న ఆలయ ప్రాంగణంలో మహా సుదర్శన హోమం తదితర పూజలు ఉంటాయన్నారు. నాలుగు వారాలు దాతల ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని వివరించారు.

జిల్లా గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని ఎన్నుకున్నారు. శనివారం జిల్లాలోని గ్యాస్ డీలర్లు సమావేశమై ఈ మేరకు ప్రతాప్‌రెడ్డిని తమ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలోని గ్యాస్ డీలర్ల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకునేందుకు తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు సత్కారం చేశారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నూత న విద్యా విధానం పేరుతో విద్యను పూర్తిగా మార్చే విధంగా కుట్ర పన్నుతోందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించి ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందించాలన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు



బి.మఠంలో ఉపాధి పథకం పనులపై సామాజిక ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

బ్రహ్మంగారిమఠం : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం కింద గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన పనులపై 11 గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ నివేదికలపై శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఇందులో ఈజీఎస్, పీఆర్, ఎస్ఎస్ఏ, టి.ఫారెస్ట్, 583 పనులకు 75కోట్ల 06 లక్షల 72వేల 202 రూపాయలు ఖర్చుచేయగా అందులో పీఆర్ కేటాయించిన నిధులలో అవకతవకలు జరిగినట్లు ఆడిట్‌లో గుర్తించామని పరిశీలకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, డీవీఓ యోగాంజనేయరెడ్డి, ఏపీడీ మైథిలీ, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఏపీఓ డాక్టర్ వసంతకుమార్, ఎస్ఆర్‌పీ మూర్తి, ఉపాధి సిబ్బంది, పలు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

మండలస్థాయిలో విద్యార్థులకు పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రత్నస్వామి

పోరుమామిళ్ల : మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో శనివారం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలలో విజేతలకు ఎంఈఓ రత్నస్వామి బహుమతులు అందజేశారు. వక్తృత్వ పోటీల్లో సీనియర్ విభాగంలో పోరుమామిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నీహారిక, జూనియర్స్ విభాగంలో ఆఫ్రిన్ విజేతలుగా నిలిచారు. మంచి దస్తూరిలో సీనియర్స్ విభాగంలో టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సౌమ్య, జూనియర్స్ విభాగంలో అదే పాఠశాలకు చెందిన నర్మద గెలుపొందారు. వ్యాసరచన పోటీల్లో సీనియర్స్ విభాగంలో పోరుమామిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన లక్ష్మీబాయి, జూనియర్స్ విభాగంలో ఆఫ్రిన్ విజేతలుగా వచ్చారు. వారికి ఎంఈఓ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలు ఉపాధ్యాయులు పాపయ్య, జనార్థన్, సీఆర్పీ జనార్ధనాచారిల ఆధ్వర్యంలో జరిగాయి.

విద్యార్థులకు ఆటల పోటీలు



మండల స్థాయి విజేతలతో ఎంఈఓ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు

కలసపాడు : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈఓ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి వక్తృత్వ, వ్యాసరచన, చేతిరాత పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన భావనశ్రీ, ఎస్.కె.తస్లీమ్, వ్యాసరచన పోటీల్లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టీ.లక్ష్మీవైష్ణవి, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన సుధీర్, చేతిరాత పోటీల్లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జి.స్వర్ణ, సి.దేవిశ్రీలు మండల స్థాయిలో విజేతలుగా నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు. వీరికి ఆగస్టు 15న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్ రావు, రామసుబ్బారెడ్డి, రవి, సలోమి తదితరులు పాల్గొన్నారు.

గండి ఉత్సవాల గోడపత్రాలు ఆవిష్కరణ



గండి ఉత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి

చక్రాయపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా గోడపత్రాలను శనివారం పులివెందులలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆలయ అధికారి అలవల పాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి స్వామి, పాలకమండలి సభ్యులు అందరూ సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. తగిన పోలీసు బందోబస్తుతో పాటు, క్యూలైన్ల ఏర్పాటు విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తొండూరు మండల ఇన్‌చార్జ్ వైఎస్ మధురెడ్డి, పాలక మండలి సభ్యులు రామాంజులరెడ్డి, అనూషతేజ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న స్థైర్యానంద సరస్వతి స్వామి

కమలాపురం : ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని శ్రీ స్థైర్యానంద సరస్వతి స్వామి తెలిపారు. శనివారం స్థానిక ఎయిమ్ ఫర్ సేవ వ్యవస్థాపకులు శ్రీ స్వామి దయానంద సరస్వతి జయంతితో పాటు 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీసీపీఎల్ సీఎంఓ సాయి రమేష్, చీఫ్ మేనేజర్ భార్గవ్‌రెడ్డితో కలసి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ దయానంద సరస్వతి స్వామిజీ దేశంలో ఇలాంటి ఎయిమ్ ఫర్ సేవ కేంద్రాలు అనేకం స్థాపించారన్నారు. అనాథలను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో ఉన్నత స్థానాల్లో చేర్పించే విధంగా ఈ సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. విద్యతో పాటు ఆధ్యాత్మికతను కూడా నేర్పించే ఇలాంటి సంస్థలు అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం తప్పనిసరి అన్నారు. గత 15 ఏళ్లుగా కమలాపురంలో ఈ సంస్థ నిర్వహించడం సంతోషకరమన్నారు.అలాగే ఇక్కడ చదివి వివిధ ప్రాంతాల్లో ఉపాధి పొందిన విద్యార్థులందరూ ఈ రోజు ఇక్కడ కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

18న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాష్ట్ర సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 18న జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శనివారం నగరంలోని డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి 9 సంవత్సరాలు అయినా నేటికి ఏర్పాటు చేయ కుండా కాలయాపన చేస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమ సాధన కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు అన్ని రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు షాకీర్, విజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెల్మెట్ లేకుండా వాహనాలను నడపరాదు



నరసాపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

కాశినాయన : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలను నడపరాదని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని నరసాపురం గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సోమాపురంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సోమాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. గ్రామ సచివాలయం సమీపంలోని విలేజ్ క్లినిక్ వద్ద ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా రాష్ట్ర మహిళానేత కృష్ణమ్మ జన్మదినం



శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

పోరుమామిళ్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీనియర్ మహిళానేత పి. కృష్ణమ్మ 87 వ జన్మదినం ఆదివారం పోరుమామిళ్లలోని ఆమె స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు పి. నాగార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శారదమ్మ, మండల కో ఆప్షన్ మెంబర్ అల్లా, ఉపసర్పంచ్ రవి, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పార్టీ అభిమానుల సమక్షంలో కృష్ణమ్మ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమం



ఎమ్మెల్యేను కలిసిన జిలాన్ బాషా

జమ్మలమడుగు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమంతోపాటు అన్ని రకాలుగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని షేక్ జిలాన్‌బాషా తెలిపారు. మరోసారి ముఖ్యమంత్రి సీఎంగా జగన్ ఉండాలి అంటూ మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర ప్రారంభించిన జిలాన్‌బాషా ఆదివారం జమ్మలమడుగుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్‌మూలె సుధీర్‌రెడ్డి ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిలాన్‌ను సన్మానించి పాదయాత్ర ముగిసే వరకు తమ సహాయ సహకారాలుంటాయని తెలిపారు.

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి



ప్రొద్దుటూరు:ర్యాలీ చేస్తున్న ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు



బద్వేలు:అంబేద్కర్ సర్కిల్‌లో మాట్లాడుతున్న కమలమ్మ



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ప్రొద్దుటూరు : మణిపూర్‌లో జరిగిన మారణహోమంలో బాధితులకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య (పీకేఎస్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయకుమార్ సర్కిల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీకేఎస్ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన హత్యాకాండకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌ను బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. పీకేఎస్ నాయకులు పద్మ, ఎం.శ్రీనివాస్ రెడ్డి, నాగభూషణ్, రాయలసీమ శక్తి నాయకులు లక్ష్మీదేవి, ఆర్ఎస్ఓ నాయకుడు జగన్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరాం, కొండారెడ్డి, బషీర్, మహ్మద్, పవన్, ఖలందర్, ప్రతాప్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి కోసం ర్యాలీ

పోరుమామిళ్ల : మణిపూర్‌లో తిరిగి శాంతియుత వాతావరణం ఏర్పడాలని, ప్రజలు సాధారణ జీవితం గడపాలని పోరుమామిళ్ల ఆర్‌సీఎం చర్చి విచారణ గురువులు జాలా విజయభాస్కర్ అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఓబులాపురం శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా శోభన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు పిడుగు మస్తాన్, భైరవప్రసాద్, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, మానవహక్కుల వేదిక నాయకుడు ఫణిరావు, దళితవేదిక రాష్ట్ర సంక్షేమ కార్యదర్శి యోహాను తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్, సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మణిపూర్ సంఘటనపై మైదుకూరులో ఆదివారం క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం తదితర చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక బద్వేలు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి నుంచి ర్యాలీ నాలుగు రోడ్ల కూడలి వరకు నిర్వహించి అక్కడ మణిపూర్ సంఘటనలో దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కడప రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు.

గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

మైదుకూరు : మైదుకూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు కోరారు. ఆదివారం పాఠశాలను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో మూడు నుంచి 10వ తరగతి వరకు చదివే 126 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అయితే వీరికి సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గణితం, ఫిజిక్స్, వ్యాయామ, చిత్రలేఖన ఉపాధ్యాయులు కూడా లేరన్నారు. వారిని వెంటనే నియమించాలని, పాఠశాలకు పక్కా భవనాలను నిర్మించాలని కోరారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

గోపవరం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

డీకే చదువుల బాబుకు సన్మానం




డీకే చదువులబాబును సన్మానిస్తున్న బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నాయకులు

ప్రొద్దుటూరు : కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబును ఆదివారం స్థానిక బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ డీకే చదువులబాబు ఉపాధ్యాయుడిగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ, మరొక వైపు నాలుగు దశాబ్దాలుగా నిరంతరం సాహిత్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి జింకా మార్కండేయ మాట్లాడుతూ చదువులబాబు వివిధ ప్రముఖ పత్రికల్లో 700 కథలు, 100కుపైగా కవితలు, 50కిపైగా బాలల గేయాలు, బాలల నవలలు, నాటికలు రచించి, 21 పుస్తకాలను ప్రచురించారన్నారు. కళాభారతి నాటక సంస్థ కార్యదర్శి కొత్తపల్లి శీను, ప్రముఖ కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ చదువుల బాబు రచనలను మహారాష్ట్రలో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా చేర్చారని, ఆయన నిరంతర కృషికి అనేక అవార్డులు, శతాధిక సన్మానాలను అందుకున్నారన్నారు. చదువులబాబు సిరిపురికి, మన జిల్లాకు, రాయలసీమకు గర్వకారణమన్నారు. సాధు ఫౌండేషన్ అధ్యక్షుడు సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ చదువుల బాబు నిరంతరం అంకిత భావంతో కృషి చేస్తూ వృత్తిలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ వార్డును, ప్రవృత్తిలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కోశాధికారి మడక సంటయ్య, కొమ్మిశెట్టి మోహన్, మూలే రామమునిరెడ్డి, భాస్కర్‌రాజు, కామనూరు రామ్మోహన్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, అమృతవల్లి, దుర్గాభవాని తదితరులు ప్రసంగించారు. అనంతరం చదువుల బాబును శాలువా కప్పి, పూలమాల వేసి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

జోరుగా పత్తి పంట సాగు



రాజుపాలెంలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు



పత్తి విత్తనాలు

రాజుపాలెం : గత రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షంతో కొన్ని గ్రామాల్లోని రైతులు పత్తి విత్తనాలను నాటుతున్నారు. ధరలు అంతంత మాత్రంగానే ఉండటం, ఖర్చు ఎక్కువవడంతో చాలామంది రైతులు ఆసక్తి చూపడం లేదని రైతులు అంటున్నారు. అయితే ధరలు, దిగుబడి బాగా రావాలని కోటి ఆశలతో పత్తిపంటను సాగు చేస్తున్నట్లు కర్షకులు చెబుతున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యురా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం శ్రీమత్ పెద్ద అహోబిళ క్షేత్ర తొగటవీరక్షత్రియ సేవా సంఘం వారి అన్న సత్రం ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్వహణలో చేపట్టిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 14 మంది వైద్యులతో ఈ శిబిరంలో 1060 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా కూష్మాండ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి దివ్యజ్ఞానానంద గిరి స్వామి మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అహోబిళ క్షేత్ర తొగటవీర క్షత్రియ అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య మాట్లాడారు. కడప, కర్నూలు, ప్రొద్దుటూరుకు చెందిన న్యూరాలజిస్టు చౌడం శ్రీనివాసులు, కార్డియాలజిస్ట్ చింతా రాజ్‌కుమార్, యూరాలజిస్ట్ జి.రాజశేఖర్, డెర్మటాలజిస్టు గౌతమి, ఉమాదేవి, శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ పల్లా భాస్కర్, వెన్నముక కీళ్ల నొప్పుల వైద్యులు డాక్టర్ శివబాబు, డాక్టర్ శిరీష, డాక్టర్ నాగదాసయ్య, డాక్టర్ ఉలసాల సుధాకర్, డాక్టర్ రాంబాబు తదితరులు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో శ్రీమత్ పెద్ద అహోబిళ క్షేత్ర తొగటవీరక్షత్రియ సేవా సంఘం వారి అన్న సత్రం కమిటీ కోశాధికారి పల్లా నాగమయ్య, ప్రధాన కార్యదర్శి చౌడం వెంకటరమణ, కార్యదర్శి పల్లా శంకర్ నారాయణ, తొగట వీరక్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, కోశాధికారి బండారు సూర్యనారాయణ, గంజికుంట ఆంజనేయులు, కంభం పుల్లయ్య, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు కల్చరల్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం ఈనెల 18న కడపలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. ఆదివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఈనెల 18న కడప యూటీఎఫ్ భవనంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బి.నారాయణ, మాజీ డీవైఎఫ్ఐ నాయకుడు జి.చంద్రశేఖర్ హాజరవుతారన్నారు.

ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

చాపాడు : మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో పంటలను సాగు చేసుకునే రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ తెలిపారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉండే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలతో పాటు సెల్ ఫోన్ నంబర్‌తో రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు.

ఈ క్రాప్ చేయించుకున్న రైతులకు అన్ని రకాలైన ప్రభుత్వ రాయితీలు, పంట నష్ట పరిహారం వంటివి వర్తిస్తాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అట్లూరు : మండల పరిధిలోని కమలకూరు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ విజయకుమార్ తెలిపారు. బద్వేలులోని సెంచూరీ ప్లైవుడ్ కంపెనీకి విద్యుత్ సరఫరా తీగల ఏర్పాటులో భాగంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ఉదయం 7–30 నుండి మధ్యాహ్నం 2–30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని కమలకూరు, మణ్యంవారిపల్లె, కాటంవారిపల్లె, వలసపాలెం, తంబళ్లగొంది, యర్రబల్లి, లింగాలకుంట, నబియాబాద్, దేవనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించాలని కోరారు.

రేపు మాజీ సైనికుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్ర్య దిన వేడుకలను నిర్వహించనున్నట్లు మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు నేట్ల బాలవీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 7 గంటలకు గాంధీరోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులు సమర్పించే కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 7.30 నుంచి 8.30 వరకు జెండా వందన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రొద్దుటూరు డివిజన్‌లోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, మైదుకూరు పరిసర ప్రాంతాల్లోని మాజీ సైనికులు, వీర నారీమణులు హాజరు కావాలని ఆయన కోరారు.

భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే నిజమైన స్నేహితుడు



భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

అట్లూరు : భగవద్గీత బోధించిన శ్రీకృష్ణ భగవానుడే మనకు నిజమైన స్నేహితుడు అని త్రైతసిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్ పేర్కొన్నారు. హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం బద్వేలు మండలంలోని బాలాయపల్లె, రంగాపురం, గోపాలపురం, కోనసముద్రం, తిప్పనపల్లె గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి పలువురికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిగురువుగా శ్రీకృష్ణుని జీవన విధానం లోకానికి ఒక ప్రామాణికమన్నారు. ధర్మం విలువ తెలిపేందుకు, ధర్మం పక్షాన నిలబడేందుకు వయోపరిమితి అడ్డు కాదని చాటిన ధర్మశీలి శ్రీకృష్ణుడు అన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత హిందూ జ్ఞానవేదిక సభ్యులు జి.సుధాకర్, కె.వెంకటేశ్వర్లు, జి.వెంకటరత్నం, కె.నరసింహులు, ఎస్.కె.సలీం, కె.భరత్‌కుమార్, డి.రమణయ్య, ఎం.నాగమ్మ, జి.మల్లేశ్వరి, కె. వెంకటసుబ్బమ్మ, యు.రత్తమ్మ, ఎస్.రమణమ్మ, యు.గాయత్రి, జి.కృష్ణమీరా తదితరులు పాల్గొన్నారు.

రాజారెడ్డిని చంపిన వారిని కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ఓ నాయకులు

ప్రొద్దుటూరు : అనాథ పిల్లల ఆశా జ్యోతి డాడీహోం వ్యవస్థాపకుడు రాజారెడ్డిని చంపిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం వద్ద ఆదివారం రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ మైలవరంలో రాజారెడ్డి డాడీహోంను నెలకొల్పి ఎంతో మంది అనాథలు, హెచ్ఐవీ బాధితులకు ఆశ్రయం కల్పించి ఆదరించారన్నారు. ఆయనను చంపిన వారిని కఠినంగా శిక్షించి డాడీహోం అనాథలకు న్యాయం చేయాలని కోరారు. డాడీ హోం, పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రభుత్వం ఆధీనంలో నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఓ నాయకులు రవి, బాలు, మోహన్, నరేష్, లోకేష్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇచ్చిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ముస్లిం మైనారిటీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీలకు అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటిస్తామన్న సీఎం జగన్ హామీని అమలు చేయాలని కోరారు. ప్రొద్దుటూరులో ఉర్దూ డిగ్రీ కాలేజి ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బాబా ఫకృద్దీన్, మాలిక్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐ సుబ్బన్నకు సత్కారం



ట్రాఫిక్ ఏఎస్ఐ సుబ్బన్నను సత్కరించిన జమాయతే సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : ఇటీవల గాంధీ రోడ్డులో కరెంట్ షాక్‌తో అపస్మారకస్థితిలో పడి ఉన్న గోల్కొండ జాఫర్‌వలిని కాపాడిన ట్రాఫిక్ ఏఎస్ఐ సుబ్బన్నను జమాయతే అహ్లే హదీస్ సభ్యులు సత్కరించారు. ఆదివారం ట్రాఫిక్ పోలీ స్టేషన్‌కు వచ్చిన ఆ సంస్థ సభ్యులు సుబ్బన్నకు పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు షేక్ సాదిక్ ఆలీ మాట్లాడుతూ తమ జామాయతే సభ్యుడైన జాఫర్‌వలిని కాపాడిన ఏఎస్ఐని తామంతా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. తన ప్రాణాలను తెగించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన ఏఎస్ఐని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ యుగంధర్, జామాయతే సభ్యులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘం జిల్లా కార్యదర్శిగా రాయపాటి దస్తగిరి

పులివెందుల టౌన్: నూర్‌బాషా సంఘం జిల్లా కార్యదర్శిగా రాయపాటి దస్తగిరిని నియమిస్తూ ఆదివారం స్థానిక నూర్‌బాషా దూదేకుల సంఘం కార్యాలయంలో ఆ సంఘ ఉమ్మడిరాష్ట్రాల నూర్‌బాషా సంఘ అధ్యక్షుడు ఓతూరు రసూల్‌సాహెబ్ నియామక పత్రాన్ని అందజేశారు. ముద్దనూరు మండలం కోణాపురం గ్రామ ఉప సర్పంచ్ రాయపాటి దస్తగిరికి సంఘ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ దూదేకుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతానన్నారు. నూర్‌బాషా సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఫుల్.. సీట్లు నిల్..



దొమ్మరనంద్యాల గ్రామంలో ఉన్న బీసీ హాస్టళ్లు



హాస్టల్‌లో భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

- కళకళలాడుతున్న ప్రభుత్వ వసతి గృహాలు
- సీట్లులేక వెనుదిరుగుతున్న విద్యార్థులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలం దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ పొందడానికి వందల సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల వారే కాకుండా దూరప్రాంత విద్యార్థులు కూడా ఈ పాఠశాలకే మొగ్గు చూపుతున్నారు. ఆశతో వచ్చిన వారిని వెనక్కి పంపకుండా పాఠశాలలో ఎలాగోలా చేర్చుకుంటున్నా దానికి అనుబంధంగా ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహంలో మాత్రం సీటు దొరకడం లేదు. దీంతో దూరప్రాంత విద్యార్థులు నిరాశతో వెనుతిరిగి వెళ్తున్నారు. ఇక్కడి హాస్టల్లో సీట్ల సంఖ్యను పెంచాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

నాలుగు అంకెల సంఖ్యకు చేరువలో..

17 తరగతి గదులున్న దొమ్మరనంద్యాల జడ్పీ హై స్కూల్లో ప్రస్తుతం 900 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ఇంకా జరుగుతున్నాయి. మరో వారం రోజుల్లో ఈ సంఖ్య దాదాపు 1000 దాటే అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు. జమ్మలమడుగు పట్టణం నుంచే కాకుండా 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు సైకిల్‌లో, ఆటోల్లో వస్తున్నారంటే ఈ పాఠశాలకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకో వచ్చు.

మెరుగ్గా సౌకర్యాలు



హాస్టల్లో ఇప్పటికే 167 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్న వారికి సౌకర్యాలు సరిపోయాయి. అయితే ఇంకా విద్యార్థుల నుంచి 70 దరఖాస్తులు వచ్చాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం అధికారులు సీట్లు పెంచి వసతులు కల్పిస్తే విద్యార్థులను చేర్చుకుంటాం.

- వెంకటరెడ్డి,బీసీ హాస్టళ్లు వార్డన్, దొమ్మరనంద్యాల

కేఓఆర్ఎం అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు సాధించిన అధ్యాపకులతో ప్రిన్సిపాల్ ఆకుల గిరిధర్

కడప ఎడ్యుకేషన్: సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్, పూనే, భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ వారు సంయుక్తంగా కడప నగర శివార్లలోని కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు సర్టిఫికెట్ కోర్సు నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆగ్మెంటెడ్ అండ్ వర్చువల్ రియాలిటి అనే అంశాలపై జరిగిన ఈ సర్టిఫికెట్ కోర్సులో కేఓఆర్ఎం అధ్యాపకులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ఇందులో అధ్యాపకులు తులసీకృష్ణ, అమీనుల్లా, గంగాలత, వెంకటకృష్ణ, రాధిక, రమేష్‌బాబు, రజిత, హరితలు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సుపై రెడ్డి మురళి, శారికబేగం, కిషోర్‌రెడ్డి, ప్రసన్నలు ఆగ్మెంటెడ్ అండ్ వర్చువల్ రియాలిటి మీద ట్రెనింగ్ తీసుకుని పరీక్షలు రాశారు. ఈ పరీక్షల్లో అందరూ గోల్డ్, సిల్వర్ గ్రేడ్‌లలో ఉత్తీర్ణులు అయినందుకు కళాశాల చైర్మన్ వెంకట శివారెడ్డి, సెక్రటరీ లిఖితరెడ్డి, ప్రిన్సిపాల్ ఆకుల గిరిధర్ హర్షం వ్యక్తం చేసి వారిని అభినందించారు.